2024లో తెనాలిలో తగ్గిన నేరాలు

తెనాలిరూరల్: 2024 సంవత్సరం నేరాల్లో తగ్గుదల కనపడింది. గతం కన్నా తక్కువగా కేసులు నమోదైనా, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కొన్ని కేసుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు సరిగ్గా లేక సస్పెండైన సందర్భాలూ ఉన్నాయి. కొన్ని ఘటనలు హృదయాలను ద్రవింపజేస్తే, మరి కొన్ని భయపెట్టాయి. తెనాలి వన్‌టౌన్‌లో ఈ ఏడాది 284, టూ టౌన్‌లో 171, త్రీ టౌన్‌లో 310, రూరల్‌లో 295, కొల్లిపరలో 195 కేసులు సోమవారం నాటికి నమోదయ్యాయి. గతంలో పోలిస్తే సంఖ్యా పరంగా తగ్గినా, తెనాలిలో ఈ ఏడాది జరిగిన కొన్ని నేరాలు రాష్ట్రం మొత్తం తెనాలి వైపు చూసేలా చేశాయి. వాటిలో కొన్ని..

కన్నీరు పెట్టించిన 'గీతాంజలి'..

సోషల్ మీడియా ముఖ్యంగా ఐ-టీడీపీ, జనసేన సోషల్ మీడియా యాక్టివిస్టుల వేధింపులకు బలైన పట్టణానికి చెందిన గీతాంజలి ఘటన అందరినీ కన్నీరు పెట్టించింది. ఈ ఏడాది మార్చి నాలుగో తేదీన ఇక్కడి కొత్తపేట తాలూకా హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో 1-20 వార్డుల ఇళ్లస్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషను పత్రాలను పంపిణీ చేశారు. ప్రతి వార్డుకు చెందిన కొందరికి అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా పత్రాలను అందజేశారు. అందులో 18వ వార్డుకు చెందిన గొల్తి గీతాంజలి (29) కూడా ఉన్నారు. సభా ప్రాంగణానికి వచ్చిన గీతాంజలి అందరితో పాటు ఎమ్మెల్యే శివకుమార్‌కు షేక్ హ్యాండ్ కూడా ఇచ్చి ఎంతో ఉత్సాహంగా కనిపించింది. ఆయన చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాను అందుకుంది. అక్కడే ఉన్న ఓ యూట్యూబ్ చానల్ పలకరిస్తే, సొంత ఇల్లు ఉండాలన్న తన కల నెరవేరిన సంతోషాన్ని వ్యక్తంచేసింది. తాను తన కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నానని, సొంత ఇల్లు అనేది అందరి కల అని, ఇంటి స్థలం పొందడం ద్వారా తన డ్రీమ్ నెరవేరిందంటూ ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది.

సంచలనం సృష్టించిన కేసులెన్నో !!



గీతాంజలి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తెలు (ఫైల్)



సహానాను వైద్యశాలలోకి ఈడ్చుకెళుతున్న రౌడీషీటర్ నవీన్ (ఫైల్)



ఇలా మాట్లాడడమే పాపమైంది. ఐ-టీడీపీ, జనసేన సోషల్ మీడియా యాక్టివిస్టులు విచక్షణారహితంగా ట్రోలింగ్ చేయడంతో అదేనెల 7వ తేదీన రైలుకింద పడి ఆత్మహత్యకు యతించి గాయాలపాలైన ఆమె 11వ తేదీన గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

సంచలనం సృష్టించిన సహానా కేసు..

పట్టణ ఐతానగర్‌కు చెందిన మధిర సహానా హత్య కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ కొంత కాలంగా తెనాలి హయ్యరుపేటలోని తన తాత వద్ద ఉంటున్నాడు. ఇదే బజారుకు చెందిన యువతి సహానాకు ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఇద్దరూ కలసి షికారులకు వెళుతుండే వారు. పలుమార్లు దగ్గరయ్యారు. ఫలితంగా సహన గర్భం దాల్చింది. సహానా వద్ద నవీన్ రూ. మూడు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అందులో రూ. 1.50 లక్షలు తిరిగి చెల్లించాడు. అక్టోబరు 19న ఆమెను కారులో బయటకు తీసుకెళ్లగా డబ్బు, గర్భం విషయం ప్రస్తావించింది. తన బాకీ చెల్లించమని కోరగా ఆవేశానికి గురై ఆమెను కారు డ్యాష్‌బోర్డు, డోరు కేసి విచక్షణారహితంగా పలుమార్లు బాదాడు. కొద్ది సేపటికే తలనొప్పిగా ఉందంటూ వాంతులు చేసుకుంది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకువచ్చి చేరి్పంచి, ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి పరారయ్యాడు. బ్రెయిన్ డెడ్‌అయిన కుమార్తెను బ్రతికించుకోవాలని తల్లిదండ్రులు ఆ రాత్రంతా పలు వైద్యశాలల చుట్టూ తిరిగారు. చివరకు గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. వైద్యశాలలో సహానాకు నివాళులర్పించి, కుటుంబానికి రూ. 10 లక్షలు ప్రకటించారు. అప్పటికిగానీ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కదలి రాలేదు.

వణికించిన 'సైనేడ్' మర్డర్లు

ప్రశాంతమైన తెనాలి ప్రాంతంలో వరుస సైనేడ్ మర్డర్లు ప్రజలను వణికించాయి. తల్లీ కూతుళ్లు మరో మహిళతో కలసి వరుస హత్యలకు పాల్పడడం సంచలనంగా మారడమే కాకుండా, తమ చుట్టుపక్కల వారినే హతమార్చడం మరింత ఆందోళనకు గురి చేసింది. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గుమ్మడి నాగేంద్రం, కఠెవరపు మోషే, షేక నాగూర్‌బీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. నాగూర్‌బీ వడ్లమూడిలో నిర్జన ప్రదేశంలో మృతి చెంది పడి ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆటోడ్రైవర్ ద్వారా కూపీ లాగగా, యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, మునగప్ప రజినీ, వెంకటేశ్వరి తల్లి రమణమ్మలు ఈ హత్యలకు పాల్పడ్డారని, అలానే మార్కాపురంలో వెంకటేశ్వరికి స్వయానా అత్త అయిన సుబ్బలక్ష్మిని హతమార్చారని పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరురుపరచగా బెయిల్‌పై ఇటీవల విడుదలయ్యారు. వరుస సైనైడ్ మర్డర్లు వెలుగు చూడడంతో యడ్ల లింగయ్య కాలనీ వణికిపోయింది. బెయిల్‌పై వచ్చిన కాలనీలోని ఇంట్లో ఉంటున్న వెంకటేశ్వరిపై స్థానికులు ఆగ్రహంతో నవంబరులో దాడి చేసి గాయపర్చారు. తయ కాలనీలో ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

'మార్ఫింగ్'లో సీఐ సస్పెన్షన్

పట్టణానికి చెందిన ఓ మహిళ తన ఫోటోలను మార్ఫింగ్ చేసి కొరియర్‌లో పంపి బెదిరిస్తున్నారని పోలీసులకు ఆగస్టు నెలలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై స్థానిక పోలీసులు గుంటూరు సమీపంలోని గోరంట్ల, ప్రకాశం జిల్లా మార్కాపురం, కంభంకు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించారు. గోరంట్లకు చెందిన హార్డ్‌వేర్ ఇంజినీర్ అయిన యువకుడిని అదే నెల 24న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు, మిగిలిన ఇద్దరినీ స్వస్థలాలకు పంపించేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఇరిద్దరిపై కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చే సెక్షన్‌లు పెట్టి పంపించేందుకు బేరసారాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. సంచలనం సృష్టించిన కేసులో సరిగా వ్యవహరించలేదంటూ శాఖా పరంగా విచారించి అప్పటి టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్‌ను మరో హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

క్లుప్తంగా

అనుమతి లేకుండా డీజేలు పెట్టవద్దు

కొల్లిపర: నూతన సంవత్సర సందర్భంగా మండలంలో ఏవరైనా వేడుకలు నిర్వహించే సమయంలో డీజేలు, లౌడ్ స్పీకర్లు పెట్టాలి అనుకుంటే తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని , అనుమతి లేకుండా పార్టీలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై కేక్ కటింగ్ లు చేయటం, రాత్రి 12గంటల నుంచి బైకులతో రోడ్లపై వివిధ సౌండ్లతో, పెద్దపెద్ద అరుస్తూ తిరిగినా వారిపై కేసులు నమోదు, రాత్రి 10 గంటలు దాటిన తరువాత బహిరంగ ప్రదేశాలల్లో , రోడ్లపై మద్యం సేవించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ చట్టం ప్రకారం అనుమతులకు లోబడి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. తొలుత ఆయన మండల ప్రజలకు, యువతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల చేత నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



మున్నంగి(కొల్లిపర): మండలంలో తొలిసారిగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు చేరటం వల్ల కలుగు ప్రయోజనాలతో బొమ్మలతో వివరంగా నూతన 2025 క్యాలెండర్ ముద్రించటం, విద్యార్థుల చేతులు మీదగా ఆవిష్కరించటం ఎంతో మంచి విషయమని పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ షేక్ సంజిదాసుల్తానా అన్నారు. సోమవారం మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్)లో ఉపాధ్యాయులు ముద్రించిన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాలెండర్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత సమదుస్తులు, డొక్కసీతమ్మ మధ్యాహ్న బడి భోజనం వంటి బొమ్మలతో ముద్రించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాము, ఉపాధ్యాయురాలు సోమరౌతులక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెటిరో కంపెనీకి 34 మంది ఏఎస్ఎన్ విద్యార్థులు



తెనాలి: ప్రముఖ ఔషధ కంపెనీ హెటిరో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫైనలియర్ చదువుతున్న బీఎస్సీ (కెమిస్ట్రీ) విద్యార్థినీ విద్యార్థినులతోపాటు, బీకాం విద్యార్థులు ఉన్నట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. వీరికి వార్షిక వేతనం రూ.2.76 లక్షలుగా సోమవారం కాలేజీలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన సభలో తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు నిర్ణయించిన సిలబస్‌తోపాటు జీవనకళలు, భావప్రకటన నైపుణ్యంలో శిక్షణ, వివిధ కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయిస్తున్న కారణంగానే తమ కాలేజీలో చదువుతున్న దాదాపు ప్రతి విద్యార్థికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. గత 37 ఏళ్ల కాలేజి చరిత్రలో ఉపాధి అవకాశాలున్న కోర్సులన్నింటినీ ప్రవేశపెడుతున్నామని గుర్తుచేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ బీకాం వంటి సంప్రదాయ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సయితం క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగం లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నట్టు తెలిపారు.

చిన్నారులకు వాక్సినేషన్



ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ, నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ ప్రత్యేక క్యాంప్‌ను సోమవారం నిర్వహించినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు ఫరీనాబేగం, శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇమ్యూనైజేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన 6నెలల నుంచి 11 నెలల చిన్నారులకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పలు వ్యాధులు రాకుండా నివారించవచ్చని చెప్పారు.ప్రత్యేక క్యాంప్ అన్ని గ్రామాల్లో మంగళవారం కూడా నిర్వహిస్తామని చెప్పారు. చిన్నారుల పూర్తి వివరాలు హెచ్ఎంఐఎస్, యూవిన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు.

అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

తెనాలిరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అమిత్ షా వ్యాఖ్యలను బీజేపీ సమర్థించడమే కాకుండ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని వాదన తీసుకురావడం బాధాకరమన్నారు. ఇది రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కులపై దాడి అని పేర్కొన్నారు. కేబీ ప్రసాద్, హుస్సేన్‌వలి, రాజ్యలక్ష్మి, సాంబశివరావు, వెంకటసుబ్బయ్య, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఆదిత్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు దోమతెరల పంపిణీ



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్‌అధ్యక్షుడు పల్లికొండ రవికుమార్, విక్టర్ పాల్ సౌజన్యంతో తెనాలి పట్టణ అసిస్టెంట్ మలేరియా అధికారి చెరసాని ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలు, ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో దోమతెరలను సోమవారం పంపిణీ చేశారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి అందె బాలచంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు బండారు మల్లేశ్వరరావు, దాసరి మల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్త షేక్ రషీద్ పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

దావులూరు(కొల్లిపర): రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు కత్తెర , పొగాకు లద్దె పురుగు ఆశించిన వెంటనే తగిన మందులు పిచికారీ చేయాలని , లేనిచో పంట దెబ్బతిని సరైన దిగుబడి లేక రాబడి లేకుండా పోతుందని, అందువలన రైతులు పురుగు నివారణపై సరైన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టరు ఎస్.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని దావులూరు గ్రామంలో తెనాలి ఏడీఏ ఉషారాణితో కలసి ఆమె మొక్క జొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న లో కత్తెర , పొగాకు లద్దెపురుగు ఉన్నట్లు గుర్తించిట్లు తెలిపారు.ఈ సందర్భంగా పురుగు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన వై ఆకారంతో తెల్లని దార ను కలిగి వుండి, ఉదర భాగంలో ఆఖరి కాందం పై 4చుక్కలు చతురస్రాకారంతో ఉంటే అది కత్తెర పురుగా గుర్తించాలి. మొదటి దశ గొంగళి పురుగు ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. ఇంటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. ఆకు సుడులను మరియు కాండాన్ని కూడా తొలచి రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తుంది. కావున తొలుత రైతులు లద్దె పురుగు, కత్తెర పురుగు గుడ్ల సమూనాలను గుర్తించి వాటిని ఏరివేసి నాశనం చేయాలి. అనంతరం ఎకరానికి ఒక లీటరు వేప నూనెను లేదా 5% వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. గొంగళి పురుగు ఉధృతి ఎక్కువగా వుంటే ఎమామెక్టిన్ బెంజోమేట్ 80 గ్రాములు లేదా స్పైనోసాడ్ 60మిలీటర్లు ఎకరానికి సుడులు లేదా మొవ్వులోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలని, ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు 10కిలోల తవుడు మరియు 2కిలోల బెల్లం 2లీటర్ల నీరు కలిపి 24గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాముల థయోడికార్బ్ కలపి సాయంత్రం వేళల్లో మొవ్వులో వేయాలని సూచించారు.



పురుగులను పరిశీలిస్తున్న డాక్టరు ఎస్.వెంకటలక్ష్మి, ఉషారాణి

వడ్డీ వ్యాపారి దాష్టీకంపై పోలీసుల మౌనం

తెనాలి: తమ కుటుంబంపై దాడిచేసిన వడ్డీ వ్యాపారిపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ చెంచుపేటలోని ఇందిరా కాలనీ నివాసి కొమరగిరి దుర్గాభవాని సోమవారం సబ్‌కలెక్టర్ వి. సంజనా సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. వివరాలను వెల్లడించారు. వడ్డీ వ్యాపారులు తన తండ్రి గంగయ్యను పీల్చుకుతింటున్నారనీ, ప్రభుత్వం నెలనెలా ఇచ్చే పింఛను కూడా దక్కనివ్వటం లేదన్నారు. దీనితో ఎస్టీ మాదిగ కులానికి చెందిన తాను ఇంటర్ చదువును మధ్యలోనే మానేసి పాచిపనులు చేసుకుంటూ తండ్రికి సహాయకారిగా ఉంటున్నానని తెలిపారు. తమ కాలనీలోనే ఉంటున్న అంగిరేకుల నాగరాజు వడ్డీ వ్యాపారం చేస్తుంటాడనీ, 2029లో తన తండ్రి గంగయ్యకు రెండు దఫాలుగా రూ.10 వడ్డీకి రూ.లక్ష అప్పుగా ఇచ్చినట్టు తెలిపారు. వేరేవాళ్ల నుంచి ఇప్పించినట్టుగా చెబుతూ జమలు రాయకుండా ఆరేళ్లలో తమనుండి కొన్ని రూ.లక్షలు వసూలు చేసినట్టు ఆరోపించారు. ఇంకా బాకీ తీర్చటం లేదని, తమ ఇంటిపైకి వచ్చి, తనతోపాటు సోదరి వెంకటరమణ, నాయనమ్మ మాణిక్యమ్మను కులంపేరుతో దూషిస్తూ కొట్టినట్టు వివరించారు. దీనిపై 26వ తేదీన త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసినప్పటికీ ఎలాంటి చర్యా తీసుకోవటం లేదన్నారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదిలావుంటే, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు 15 అర్జీలను దాఖలు చేశారు. వీటిలో రెవెన్యూకు సంబంధించిన అర్జీలు అయిదుకాగా, మున్సిపాలిటీ, పౌరసరఫరాలశాఖ, గ్రామపంచాయతీల పరిధిలో రెండేసి చొప్పున అర్జీలు రాగా, పంచాయతీరాజ్, పోలీస్, విద్యాశాఖ, విద్యుత్‌శాఖ పరిధిలోనికి ఒక్కొక్క అర్జీ వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖలకు పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తామని సబ్‌కలెక్టర్ వివరించారు.



అర్జీనిచ్చి సమస్యను వివరిస్తున్న దుర్గాభవాని

కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సేవలు విస్తృతం

తెనాలి: ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన సంవత్సరంలో మరింత విస్తృతంగా ఖాతాదారులకు సేవలను అందించనుందని సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడించారు. సోమవారం సొసైటీ డైరెక్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2001లో నెలకొల్పిన తమ సొసైటీ ఖాతాదారుల ఆదరణతో 11 శాఖలను ప్రారంభించి, 10 వేల సభ్యులతో నడుస్తోందని గుర్తుచేశారు. సొసైటీకి మొత్తం రూ.130 కోట్ల డిపాజిట్లను సేకరించి, రూ.110 కోట్ల రుణాలను మంజూరు చేసిందని తెలిపారు. రూ.20 కోట్ల రిజర్వులు సమకూర్చుకుని, వివిధ రకాల సైజుల్లో లాకర్లను అందిస్తూ రూ.550 కోట్ల టర్నోవరుతో 43 మంది సిబ్బంది, ప్రతిరోజూ రూ.5 లక్షల కలెక్షన్ తీసుకొచ్చే 15 మంది డైలీ డిపాజిట్ ఏజెంట్లతో నడుస్తోందని వివరించారు. ఈసేవలను విస్తృతం చేయాలన్న భావనతో నూతన సంవత్సరం తొలిరోజు నుంచి బ్యాంకు పనివేళలను మార్చు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనిచేయటమే కాకుండా ఆదివారం కూడా పనిదినంగా నిర్ణయించామని వివరించారు. సొసైటీ ఖాతాదారులు పనివేళలను, ఆదివారం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితో బ్యాంక్ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశర్మ, కఠారి వాసుదేవనాయుడు, షేక్ ఖలీల్, దావులూరి చక్రధర్ చౌదరి, పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, 'పోస్ట్' సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శ్రీనివాసబాబు తదితరులున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ డీఎల్ కాంతారావు

నేడు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

తెనాలి: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం ఉదయం 11.45 గంటలకు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుంది. 2024-25 సవరించిన బడ్జెట్ అంచనాలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెడతారు. ఈ ప్రత్యేక సమావేశానికి ముందుగా ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుంది. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఆమోదం, టెండర్లపై నిర్ణయం, ఇప్పటికే పూర్తిచేసిన పనులకు ర్యాటిఫికేషన్ వంటి 62 అంశాలను అజెండాలో పొందుపరిచారు. ఇందులో నవంబరు-2024 నెలకు సంబంధించిన జమాఖర్చుల అంశం కూడా చేర్చారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని కోర్టు ప్రాంగణం ఎదుట సోమవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను బహిష్కరించారు. అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక సివిల్ దావా విషయంలో న్యాయవాది వివి శేషాద్రిని పిలిపించి బెదిరించడం, వేధింపులకు గురి చేసిన కారణంగా ఆయన గుండెపోటుతో మృతి చెందాడని న్యాయవాదులు తెలిపారు. ఇందుకు నిరసనగా విధులను బహిష్కరించినట్లు చెప్పారు. న్యాయవాది మృతికి కారణమైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని, సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని మృతి చెందిన న్యాయవాది కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, గ్రంధి జయరామకృష్ణ, కె. సుశీల, డి. శిరీష, కొండయ్య, కామినేని శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, అబ్రహం లింకన్, మామిడాల శ్రీనివాసరావు, ఆదయ్య, సిహెచ్ మైకేల్, పుల్లారావు, షంషేర్ బాషా పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



తెనాలిరూరల్: తెనాలి మార్కెట్ వంతెన వద్ద తెనాలి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హెల్మెట్ వినియోగంపై వినూత్న రీతిలో ప్రచారం చేపట్టారు. రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్లపై అవగాహన కల్పించారు. యమ ధర్మరాజు, యమ భటుడు, వినాయకుడి వేషాలతో ఉన్న వారితో హెల్మెట్లువినియోగించాలి, సీట్ బెల్టులు ధరించాలి అంటూ ప్రచారం చేయించారు. వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్టులతో పాటు హెల్మెట్‌లు ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సిఐ మల్లికార్జునరావు, ఎస్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని విధంగా ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం తప్పుతుందని తెలియజేశారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

కొల్లిపర ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశపు అజెండా సభా కార్యక్రమం నిర్వహించారు. 2025-26 వార్షిక అంచనా బడ్జెట్, 24-25 సవరణ బడ్జెట్ ఆమోదం పై ఎంపీడీవో విజయలక్ష్మి ప్రజా ప్రతినిధులు, అధికారుల ముందు వివరించి నిర్ణయాలు తీసుకున్నారు. పీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర భుత్వాలు, పన్నులు రూపంలో వచ్చిన ఆదాయాలతో ప్రజా అవసరాల మేరకు పనులు జరిగేలా నిర్ణయాలు ఉండాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 2024-25 సవరించిన అంచనా ప్రకారం రాబడులు రూ.13,07,43,000 ఉండగా వ్యయం రూ.13,04,95,000 చేయగా మిగులు రూ.2,48,000 ఉన్నట్లు తెలిపారు. 2025-26 బడ్జెట్ అంచనా రూ.14,12,75,000 ఉండగా వ్యయం రూ.14,10,15,000 అంచనాలు చేయగా మిగులు రూ.2,60,000 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, ఈవోపీఆర్డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

18 ఏళ్ల లోపు వివాహం చేయరాదు

ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: అమ్మాయిలకు పద్దెనిమిదేళ్ల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభ ఆవరణలో కిశోర వికాసంపై మండల స్థాయిలో శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీడీపీఓ ఎం.సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం కిశోర బాలికల హక్కులు, బాల్య వివాహాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బుతుక్రమ పరిశుభ్రత, పౌష్టికాహారం, యోగ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎం.సునీత , తహసీల్దారు జి.సిద్ధార్థ, రిసోర్స్ పర్సన్స్ జిల్లా డీసీపీఓ విజయకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ కె.వెంకట లక్ష్మి, ఎంపీహెచ్ఈవో టి.నాగరాజు, ఏపీఎం పి.రమాదేవి, ఈవోపిఆర్డీ సి.హెచ్.భార్గవ్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కె.సమీర్‌కుమార్, మహిళా పోలీసులు, సచివాలయం సిబ్బంది, స్కూల్ టీచర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు హేయం

కొల్లిపర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అంబేడ్కర్, అంబేడ్కర్ అంటూ నామస్మరణ జపం చేయటం కంటే భగవంతుని నామస్మరణ చేస్తే స్వర్గంలో ప్రవేశం దొరుకుతుందని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించి, అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.భావనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఖండించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడాలని రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో చీలికలు తెచ్చి విభజించే రత్నాలని ఐక్యంగా ప్రజలందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నాయకులు మొలక శివసాంబిరెడ్డి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకుడు కొల్లి శివనాగిరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, కార్మిక నాయకులు గోదా సుందరరావు, మల్లోల రమేష్, రామయ్య, కొల్లిపర కోటేశ్వరరావు, మల్లోల కుమారి, గోదా దీనమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు, కార్మికులు

పెట్రోలు బంకు సిబ్బందిపై దాడి

తెనాలిరూరల్: పెట్రోలు బంకు సిబ్బందిపై దాడికి పాల్పడిన యువకులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బీసీ కాలనీకి చెందిన యువకులు పెట్రోలు కొట్టించుకునేందుకు బుర్రిపాలెం రోడ్డులోని బంకుకు సోమవారం వెళ్లారు. అక్కడ సిబ్బందితో వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. పెట్రోలు కొట్టే వ్యక్తిపై దాడి చేయగా అతని ఫిర్యాదుతో టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణాల మంజూరులో సరళతరం ఏలూరి బ్యాంక్

తెనాలి: రుణాల మంజూరులో వాణిజ్యబ్యాంకులకన్నా ఏలూరి బ్యాంక్ సరళతరంగా వ్యవహరిస్తోందని ఆ బ్యాంక్ మేనేజర్ శేషకుమార్ అన్నారు. దీనిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుశాఖలో సోమవారం జరిగిన ఖాతాదారుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తక్కువ వడ్డీతో బంగారు నగలపై రుణాలను ఇవ్వటమే కాకుండా రూ.10 లక్షల వరకు ఎటువంటి రుజువులు అవసరం లేదన్నారు. అసిస్టెంట్ మేనేజరు రవిమోహన్ మాట్లాడు తూ ప్రతి ఖాతాదారు అవసరాలకు బ్యాంక్ సిబ్బంది వ్యక్తిగతంగా హాజరవుతారని, చిన్న ఖాతాదారులకు అధిక ప్రాధాన్యతనిస్తూ బ్యాంకింగ్ సేవలను సత్వరం అందిస్తున్నామని వివరించారు. కాకతీయ సహకార సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, పెరుగు మల్లిఖార్జునరావు, ఎ.సాంబశివరావు, యక్కల శ్రీమన్నారాయణ, రాచాబత్తుని బ్రహ్మం, ఓబులశెట్టి రమేష్‌బాబు, ఫణికుమార్ పాల్గొన్నారు. ఏలూరి బ్యాంక్ సిబ్బంది దుర్గాభవాని, పఠాన్ మాలిక్, మార్కెటింగ్ మేనేజర్ గుంటుపల్లి ఉషాకిరణ్, సంతోష్ పర్యవేక్షించారు.

